సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 30 । జనవరి । 2024



ప్రతి ఎకరాకు నీరందిస్తాం

ప్రతి ఎకరాకు సాగు నీరు అందించి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి అన్నారు. 8లో▸



ప్రజల వద్దకే సంక్షేమ ఫలాలు

ఆరు గ్యారంటీ పథకాల హామీని అమలు చేసి తీరుతామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. 8లో▸



హుక్కా సెంటర్‌పై దాడి

బాలాపూర్ ఠాణా పరిధిలో అక్రమంగా కొనసాగుతున్న హుక్కా సెంటర్‌పై మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు దాడి చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

సాగర్‌రోడ్డుపై వాహనాల తనిఖీ



యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం మండల కేంద్రంలో సోమవారం స్థానిక పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా, అతి వేగంగా వెళ్తున్న ప్రయాణికులను నిలిపి హెచ్చరికలు జారీ చేశారు. కొందరికి జరిమానా విధించారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని సీఐ సైదయ్య హెచ్చరించారు.

బహుజన సాహిత్య అకాడమీ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్



వెంకటేశ్‌కు నియామక పత్రం అందజేస్తున్న నల్లా రాధాకృష్ణ

షాబాద్: బహుజన సాహిత్య అకాడమీ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని నాగర్‌కుంట గ్రామానికి చెందిన మల్లీ వెంకటేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం నగరంలోని జాతీయ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతులమీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. నవ సమాజ నిర్మాణమే లక్ష్యంగా బహుజన సాహిత్య అకాడమీ ముందుకు సాగుతుందని అన్నారు.

కష్టపడి కాదు.. ఇష్టపడి చదవండి



మాట్లాడుతున్న గంప నాగేశ్వర్‌రావ్

ఆమనగల్లు: విద్యార్థులు కష్టపడి కాకుండా.. ఇష్టపడి చదవాలని.. అప్పుడే మంచి ఫలితాలు సాధించగలుగుతారని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు గంప నాగేశ్వర్‌రావ్ అన్నారు. ఏరంగంలోనైనా పోటీతత్వం ఉంటేనే రాణించగలుగుతారని చెప్పారు. ఆమనగల్లు పట్టణంలోని భవానీ గార్డెన్స్‌లో సోమవారం ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా) ఆమనగల్లు డివిజన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ బాలాపూర్‌లోని వాగ్దేవి జూనియర్ కళాశాల సహకారంతో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల, వెల్దండ మండలాల పరిధిలోని ప్రైవేటు పాఠశాలల ఎస్‌ఎస్‌సీ విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా గంప నాగేశ్వర్‌రావ్, డా.భువనగిరి పవన్‌శాస్త్రి విద్యార్థులకు ఎస్‌ఎస్‌సీలో పది గ్రేడ్ సాధించడానికి కావాల్సిన ప్రేరణాత్మక సూచనలు చేశారు. గంప నాగేశ్వర్‌రావ్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రత ఉంటే విజయం సాధిస్తారని అన్నారు. ఉన్నత లక్ష్యంతో ముందుకుసాగి విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు సిద్దాల బీరప్ప, రాష్ట్ర కార్యదర్శి తల్లోజు వెంకటయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అవ్వారి నిరంజన్, జిల్లా కోశాధికారి చుక్క అల్లాజీగౌడ్, ఆమనగల్లు డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పరిరక్షించండి



అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ భూములను పరిరక్షించాలని బీఎస్పీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని గౌరెల్లితో పాటు ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కబ్జా చేశారని ఆరోపించారు. అనాథాశ్రమాల పేరుతో అన్యాక్రాంతం చేశారన్నారు. భూకబ్జారాయుళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రహ్లాద్, చిత్రం కృష్ణ, ధన్‌రాజ్, చిరంజీవి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా‘వాణి’ వినాల్సిందే..

లైట్ తీసుకుంటున్న అధికారులు

- హాజరు కాని హెచ్‌ఓడీలు
- ఏళ్ల తరబడి పెండింగ్‌లో అర్జీలు
- పరిష్కారం కోసం బాధితుల ప్రదక్షిణలు
- సీరియస్‌గా తీసుకున్న కొత్త కలెక్టర్
- నిర్లక్ష్యం వీడకపోతే చర్యలు తప్పవని హెచ్చరిక



ప్రజావాణిలో అర్జీలు సమర్పించేందుకు వచ్చిన జనం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహించే ‘ప్రజావాణి’ని జిల్లాలోని కొంత మంది అధికారులు లైట్ తీసుకుంటున్నారు. కార్యక్రమానికి వేళకు రాకపోవమే కాదు బాధితులు ఇచ్చిన అర్జీలను కనీసం పట్టించుకోవడం లేదు. దీంతో ప్రస్తుతం అవి ఏ దశలో ఉన్నాయో? ఏ అధికారి పరిశీలనలో ఉందో తెలుసుకోవడం కష్టంగా మారింది. కీలకమైన ధరణి సంబంధిత సమస్యలే కాదు చిన్నచిన్న సమస్యలకు కూడా పరిష్కార మార్గం లభించకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పటికప్పుడు ఆయా అర్జీలపై సమీక్ష సమావేశాలు నిర్వహించాల్సిన జిల్లా అధికారులు వాటిని పట్టించుకోవడం లేదు. ఫలితంగా బాధితులు ఏళ్ల తరబడి ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇచ్చిన అర్జీలనే మళ్లీమళ్లీ ఇవ్వాల్సి వస్తోంది. ఇటీవల బదిలీపై జిల్లాకు వచ్చిన కలెక్టర్ శశాంక ఈ అంశంపై దృష్టిసారించారు. సోమవారం ఆయన స్వయంగా ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు బాధితుల నుంచి 98 అర్జీలు స్వీకరించారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

కోవిడ్‌తో నిలిచిన ఎన్‌ఐసీ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కలెక్టరేట్ సహా ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి సోమవారం ‘ప్రజావాణి’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. బాధితులు అందజేసిన అర్జీలను నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో పొందుపరిచేవారు. ఆయా అర్జీలు నేరుగా ఆన్‌లైన్‌లోనే సంబంధిత శాఖల అధికారులకు చేరేవి. అర్జీ స్టేటస్ కూడా సులభంగా తెలుసుకునే అవకాశం ఉండేది. కోవిడ్ కారణంగా 2020 మార్చిలో ఈ కార్యక్రమాన్ని నిలిపివేశారు. ఆ సమయంలో పోస్టల్/ ఇన్‌వార్డుల్లో సమర్పించిన అర్జీలను మాత్రమే స్వీకరించేవారు. వచ్చిన దరఖాస్తులను ఎన్‌ఐసీ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయక పోవడంతో మెజార్టీ సమస్యలకు పరిష్కార మార్గం లభించలేదు. వాటి ట్రాకింగ్ కూడా కష్టమయ్యేది. కోవిడ్ తగ్గుముఖం పట్టిన తర్వాత 2022 సెప్టెంబర్‌లో కార్యక్రమాన్ని పునరుద్ధరించారు. జిల్లాస్థాయి అధికారులు కాకుండా ఆఫీసులోని వివిధ సెక్షన్లకు సంబంధించిన కిందిస్థాయి సిబ్బందిని ఈ కార్యక్రమానికి పంపేవారు. వీరు కేవలం సూచనలు, సలహాలు మాత్రమే ఇచ్చేవారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేవారు కాదు. ప్రతి వారం కనీసం 200 అర్జీలు అందేవి. బాధితుల నుంచి అందిన దరఖాస్తులను పాత ఎన్‌ఐసీ సాఫ్ట్‌వేర్‌లో కాకుండా ఎక్సెల్ షీట్‌లో నమోదు చేసేవారు. ఫలితంగా మెజార్టీ ఫిర్యాదులు ఉన్నతాధికారులకు చేరేవి కాదు. కిందిస్థాయి అధికారుల వద్దే పెండింగ్‌లో ఉండేవి. ఏళ్లు గడుస్తున్నా.. సమస్యకు పరిష్కారం చూపకపోవడంతో బాధితులు అసహనానికి గురయ్యేవారు. అధికారులపైనే కాకుండా ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసేవారు.

ఇక ఆన్‌లైన్‌లో అర్జీల స్టేటస్

కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ‘ప్రజావాణి’ కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకుంది. పాలనా పరమైన ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. గతంలో అమల్లో ఉన్న ఎన్‌ఐసీ సాఫ్ట్‌వేర్ పునర్వినియోగానికి ఏర్పాట్లు చేసింది. సమస్యల పరిష్కారం కోసం అనేక వ్యయప్రయాసల కోర్చి కలెక్టరేట్‌కు చేరుకున్న బాధితుల అర్జీలను ఇకపై ఎన్‌ఐసీ సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చాలని నిర్ణయించింది. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తోంది. ప్రజావాణి వేదికగా బాధితులు ఇచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చడంతో పాటు వాటి స్టేటస్‌ను కూడా అందులో పొందుపర్చనున్నారు. అర్జీ ఏ రోజు ఏ అధికారి వద్దకి వెళ్లింది..? ఎన్ని రోజుల సమయం పట్టింది? ఆ అధికారి ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? వంటి వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంది. ఒకవేళ ఏదైనా సమస్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంటే అందుకు కారణాలను వివరించాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో పొందుపర్చిన దరఖాస్తులను కలెక్టర్ ఎప్పటికప్పుడు పరిశీలించే అవకాశం ఉంది. తద్వారా పని చేయని అధికారులపై చర్యలు తీసుకోవచ్చు. సమస్యల పరిష్కారంలో వేగాన్ని పెంచడంతో పాటు పారదర్శకతను ప్రదర్శించే అవకాశం ఉంది.

అధికారులపై కలెక్టర్ సీరియస్

ప్రజావాణి కార్యక్రమంలో గతంలో అదనపు కలెక్టర్, డీఆర్‌ఓ, డి సెక్షన్ అధికారి, ఆపరేటర్లు మాత్రమే పాల్గొనేవారు. ఆయా శాఖల జిల్లా అధికారులెవరూ కన్పించే వారు కాదు. ఇటీవలే కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శశాంక ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. వారం రోజుల క్రితమే ఆయాశాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హెచ్‌ఓడీలంతా కార్యక్రమానికి హాజరు కావాల్సిందేనని హుకుం జారీ చేశారు. అయినా మెజార్టీ అధికారులు ఎప్పటిలాగానే ఈ వారం కూడా కిందిస్థాయి సిబ్బందిని పంపి చేతులు దులుపుకొన్నారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ వారిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. అనంతరం ఆయన అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, డీఆర్‌ఓ సంగీతతో కలిసి బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. బాధితులు సమస్యలను సావధానంగా విని, పరిష్కార మార్గం చూపిస్తామని హామీ ఇచ్చారు.

నేడు దెబ్బడగూడకు మంత్రి శ్రీధర్‌బాబు రాక

కందుకూరు: మండల పరిధిలోని దెబ్బడగూడలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి మంగళవారం ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి డి.శ్రీధర్‌బాబు హాజరుకానున్నారు. ఈ మేరకు సర్పంచ్ ఏనుగు శ్రావణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులను ప్రారంభిస్తారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు హాజరుకావాలని కోరారు.

ఆధునిక పద్ధతితో అధిక దిగుబడులు



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, శాస్త్రవేత్తలు

హయత్‌నగర్: వ్యవసాయ నిపుణుల సూచనలు తీసుకుని.. ఆధునిక పద్ధతులు అవలంబించడం ద్వారా పత్తి సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని క్రీడా డైరెక్టర్ వి.కె సింగ్, కేవీకే హెడ్ రమణ అన్నారు. హయత్‌నగర్‌లో మెట్ట వ్యవసాయ క్షేత్రంలో సోమవారం జరిగిన అవగాహన సదస్సుకు హాజరైన వారు రైతులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధిక సాంద్రత పద్ధతిలో విత్తుకుని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. నీటి పారుదల, ఎరువుల యాజమాన్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు విజయ్‌కుమార్, శ్రీనివాస్, సుధీర్, వాణిశ్రీ, నవీన్, శ్రీకృష్ణ, హరిక తదితరులు పాల్గొన్నారు.

అట్టుడికిన బాలాపూర్

- మయన్మార్ రోహింగ్యాల ఆందోళనతో ఉద్రిక్తత
- పోలీసులపై రాళ్లదాడి
- కానిస్టేబుల్‌కు గాయాలు



రోహింగ్యాల ఆందోళనతో మోహరించిన పోలీసులు

పహాడీషరీఫ్: బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 28న బర్మా దేశానికి చెందిన యువకుడు హత్యకు గురవడంతో ఆ దేశ శరణార్థులు సోమవారం ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. బర్మాకు చెందిన ఇబ్రహీం అనే యువకుడు హైదరాబాద్‌కు చెందిన ఆసీఫ్, ఖయ్యూంల దాడిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. దీంతో ఆగ్రహించిన ఆ దేశానికి చెందిన శరణార్థులు బాలాపూర్ రాయల్ కాలనీలోని యూఎన్‌హెచ్‌సీఆర్ కార్యాలయం వద్ద మృతదేహంతో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఇబ్రహీంను హత్య చేసిన నిందితులను కూడా చంపేయాలని పట్టుబట్టారు. ఈ ధర్నాకు ఎంబీటీ నేత అంజదుల్లా ఖాన్, జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది మద్దతు పలికారు. నిందితులపై చర్యలకు పట్టుబట్టారు. పోలీసులు నచ్చజెప్పినప్పటికీ శరణార్థులు వినకపోవడంతో చెదరగొట్టే ప్రయత్నం చేశారు. దీంతో రెచ్చిపోయిన వారు పోలీసులపై రాళ్ల దాడికి దిగారు. ఈ ఘటనలో బాలాపూర్ ఠాణాకు చెందిన కానిస్టేబుల్ శ్రీశైలంకు గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసు ఉన్నతాధికారులు, రాజకీయ నేతలు సముదాయించడంతో వారు ఆందోళన విరమించి మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం తీసుకెళ్లారు. అవాంఛనీయ సంఘటనలకు జరగకుండా కేంద్ర బలగాలతో పహారా ఏర్పాటు చేశారు.

రెట్టించిన ఉత్సాహంతో పని చేద్దాం

- గత ఎన్నికల్లో ఓటమికి కుంగిపోవద్దు
- లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుదాం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: ‘గత ఎన్నికల్లో ఓటమికి కుంగిపోవద్దు.. ప్రజలు మనకు పదేళ్లు పాలించే అవకాశం ఇచ్చారు. ఇప్పుడు కూడా బలమైన ప్రతిపక్ష హోదా ఇచ్చారు. ఆ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిద్దాం.. రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుదాం’ అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పట్టణంలోని కేజీఆర్ గార్డెన్స్‌లో సోమవారం పార్టీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన కేడర్‌లో ఉత్సాహం నింపారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని, రంజిత్‌రెడ్డిని మరోసారి ఎంపీగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

గెలుపు, ఓటములు సహజం

ప్రతీ ఎన్నిక మనదే అనుకొని పనిచేయాల్సిన అవసరం ఉందని, గత ఎన్నికల ఫలితాలకు కుంగిపోకుండా ప్రజల ఆశీర్వాదం కోసం పనిచేయాలని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. గెలుపు, ఓటములు సహజమేనని పేర్కొన్నారు. చేవెళ్లలో ఎమ్మెల్యే యాదన్న కోసం పనిచేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు అని.. ఇప్పుడు మరింతగా పనిచేయాలన్నారు. కేసీఆర్ ఫిబ్రవరి 1న ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకరం చేసి ప్రజల వద్దకు వస్తారన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, రాష్ట్ర యువ నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి, జిల్లా యువజన నాయకుడు పట్నం అవినాష్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, మహిళా నాయకురాలు స్వప్న, నియోజకవర్గ నాయకులు, ఐదు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు?

‘సుంకిశాల’పై ఆశలు అడియాసలే!

- ‘డెడ్ స్టోరేజ్’ పనులు వెరీ స్లో
- గడువు పూర్తయినా సగం దాటని వైనం
- ప్రాజెక్టు నిధులపై లభించని స్పష్టత
- పనుల పురోగతిపై పర్యవేక్షణ అంతంతే..
- పడిపోతున్న నాగార్జున సాగర్ నీటిమట్టం
- ఈ సారి ప్రత్యామ్నాయం కోసం పాత పద్ధతే గతి..

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరానికి తాగు నీరు అందిస్తున్న ‘నాగార్జునసాగర్’ జలాశయంలో నీటి పరిమాణం డెడ్ స్టోరేజీకి చేరినప్పటికీ..నీరు తరలింపునకు ఆటంకం లేకుండా ఉండేందుకు చేపట్టిన ‘సుంకిశాల పథకం’ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ ఏడాది వేసవిలో ఈ పథకం నగరాన్ని ఆదుకునే పరిస్థితి కనిపించడం లేదు. నాగార్జునసాగర్‌లో నీటి మట్టాలు అడుగంటిపోతుండటంతో ఈసారి కూడా రూ. కోట్లాది ఖర్చుతో కూడుకున్న అత్యవసర పంపింగ్ పరిస్థితి పునరావృతమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇప్పటికే సాగర్ జలాశయంలో నీటిమట్టం అడుగంటి ఉండటంతో తాగు నీటికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. గతేడాది ఎగువ ప్రాంతంలో వర్షాలు సరిగ్గా లేక వరద నీరు జలాశయంలోకి పెద్దగా చేరలేదు. ఫలితంగా వేసవి కాలం రాకముందే నాగార్జునసాగర్ నీటిమట్టం 520 అడుగులకు చేరింది. మరో పది అడుగులు నీటిమట్టం తగ్గేంత వరకు ఎలాంటి పంపింగ్ లేకుండా నీటిని తరలించేందుకు అవకాశం ఉంటుంది. ఆ తర్వాత మోటర్లతో పంపింగ్ ద్వారా తరలింపు కూడా డెడ్ స్టోరేజ్ వరకు మాత్రమే పరిమితం. అయితే శాశ్వతంగా జలాశయం నీటి మట్టంతో సంబంధం లేకుండా నిరాటంకంగా కృష్ణా జలాలు నగరానికి తరలించేందుకు చేపట్టిన సుంకిశాల ఇన్‌టెక్ వెల్ పథకం ఇప్పట్లో అందుబాటులో వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

ప్రస్తుతం నీటి తరలింపు ఇలా..

కృష్ణా తాగు నీటి సరఫరా పథకంలో భాగంగా మూడు దశల ద్వారా నిత్యం 270 మిలియన్ గ్యాలన్ల తాగునీటిని నాగార్జున సాగర్‌లోని పుట్టంగండి పంప్‌హౌస్, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా సేకరించి మహా నగరానికి తరలిస్తున్నారు. వేసవిలో నాగార్జునసాగర్‌లో నీటి మట్టాలు 510 అడుగుల దిగువనకు చేరినప్పుడు అత్యవసర పంపింగ్ ద్వారా కోదండాపూర్ నీటిశుద్ధి కేంద్రానికి కృష్ణా జలాలను తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు లేకపోవడంతో ప్రతి వేసవిలో సాగర్ బ్యాక్ వాటర్ వద్ద డ్రెడ్జింగ్ ప్రక్రియను చేపట్టి భారీ మోటార్లతో పంపింగ్ చేయాల్సి వస్తోంది. ఇందుకు కేవలం వేసవి అత్యవసర పనులు కోసం రూ.కోట్లు వెచ్చించాల్సి వస్తోంది.




కొనసాగుతున్న సుంకిశాల పనులు

శాశ్వత పరిష్కారం కోసం సుంకిశాల

- మహానగరానికి రాబోవు 50 ఏళ్లవరకు ఎలాంటి తాగునీటి కష్టాలు రాకుండా చూసేందుకు సుమారు రూ.2215 కోట్ల అంచనా వ్యయంతో కృష్ణా తాగు నీటి సరఫరా పథకంలో భాగంగా సుంకిశాల ఇన్‌టెక్ వెల్ ప్రాజెక్టు చేపట్టారు.
- ప్రాజెక్టులో భాగంగా సుంకిశాల హెడ్‌వర్క్స్ నిర్మాణంతోపాటు అండర్ గ్రౌండ్ షాఫ్ట్, ఇన్‌టెక్ టన్నెలింగ్, పంప్‌హౌస్, సూపర్ స్ట్రక్చర్, ఎలక్ట్రో మెకానికల్ ఎక్విప్‌మెంట్, సుంకిశాల నుంచి కోదండాపూర్ నీటి శుద్ధి కేంద్రం వరకు పైపులైన్ల నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది.
- కానీ, రెండేళ్లు దాటినా పనులు ఒక అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతున్నాయి.
- గతేడాది జూన్ వరకు సుంకిశాల పథకాన్ని పూర్తి చేస్తామని అప్పటి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. ఆ తర్వాత ప్రాజెక్టు నిర్మాణ గడువును 2024 వేసవి నాటి పెంచింది. కానీ,. ఇప్పటి వరకు సగంలోపు పనుల పురోగతి కూడా లేకపోవడం విస్మయానికి గురి చేస్తోంది.
- తాజాగా ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి గడువు పెంచినట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. పనుల పురోగతిపైకూడా సంబంధిత అధికార గణం పర్యవేక్షణ సైతం అంతంత మాత్రంగా తయారైంది.

ఇప్పటి వరకు 37 శాతం పనులు..



సుంకిశాల ఇన్‌టేక్ వెల్ ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల విడుదలపై స్పష్టత కరువైంది. ఎన్నికల నేపథ్యం, ఇతరాత్ర కారణంగా నిధుల విడుదల జాప్యంతో గత కొంత కాలంగా పనులు పురోగతి మొక్కుబడిగా తయారైంది. మొత్తం మీద ఇప్పటి వరకు రూ.820 కోట్ల విలువ గల 37 శాతం పనులు మాత్రమే పూర్తయినట్లు అధికార నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అందులో రూ.451.07 కోట్ల విలువగల ఇన్ టెక్ వెల్ పనులు, రూ. 300.60 కోట్ల విలువైన పంపింగ్ మెయిన్ పనులు, రూ.30.74 కోట్ల విలువైన ఎలక్ట్రానిక్ పనులు మాత్రమే పూర్తయినట్లు నమోదైంది. మొత్తం మీద ఇప్పటి వరకు జరిగిన పనులకు సంబంధించి రూ.782.41 కోట్లు మాత్రమే చెల్లించనట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. సంబంధిత జలమండలి అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప పనులు శరవేగంగా ముందుకు సాగే పరిస్థితి కనిపించడం లేదు.

ప్రజల వద్దకే సంక్షేమ ఫలాలు



బండరావిరాలలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసి తీరుతామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బలిజగూడ, బాచారం, బండరావిరాల, చిన్నరావిరాల, గువ్వలేటి గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మిగులు బడ్జెట్‌తో అప్పగించిన రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చిందని, పదేళ్లుగా ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ నేతలకు ప్రజలు మరింత బుద్ధి చెప్పాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో అమలవుతోన్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ పథకాలకు తోడుగా ఉచిత కరెంట్, సబ్సిడీ గ్యాస్ పథకాలను త్వరలోనే ప్రజలకు అందించనున్నామన్నారు. మిగిలిన పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ 100 రోజుల్లో అందించే విధంగా రేవంత్‌రెడ్డి సర్కారు కసరత్తు చేస్తున్నదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ఏ ఒక్కరూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. అధికారులే ప్రజల వద్దకు వచ్చి సంక్షేమ పథకాలను అందించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను దశల వారీగా పూర్తి చేస్తామని, సంక్షేమ పథకాల విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బుర్ర రేఖ, జెడ్పీటీసీ బింగి దాసుగౌడ్, వైస్‌ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, సర్పంచులు వీరస్వామిగౌడ్, సంతోష, శ్రీనివాస్‌రెడ్డి, వనజ, ఉపసర్పంచులు సురేష్, ప్రభాకర్‌ముదిరాజ్, ఎంపీటీసీలు వెంకటేశ్, అనిత, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌస్‌పాషా, నాయకులు జైపాల్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, తహసీల్దార్ రవీందర్ దత్, ఎంపీడీఓ మమతాబాయి, ఎంపీఓ వినోద నాయకులు, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు చేతివాటం

- ఏసీబీ కార్యాలయం ఎదుట పార్క్ చేసిన కారు చోరీ
- సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడి పట్టివేత

బంజారాహిల్స్: ఖరీదైన కారుపై కన్నేసిన హోంగార్డు చాకచాక్యంగా దానిని తస్కరించి కటకటాలపాలయ్యాడు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని ఎన్‌బీటీనగర్‌లో నివసించే కలవకూరి లోకేష్ సింగ్ వీల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో సేల్స్ పర్సన్‌గా పనిచేస్తున్నాడు. అస్సాంకు చెందిన సంస్థ ప్రతినిధి హైదరాబాద్‌కు వచ్చినప్పుడు తిరిగేందుకు మహీంద్ర కేయూవీ 100 కారును లోకేష్ వద్ద ఉంచాడు. లోకేష్ ఈ కారును ప్రతిరోజూ ఏసీబీ కార్యాలయం ఎదురుగా రోడ్డు పక్కన పార్కింగ్ చేసేవాడు. ఈ నెల 22న కారు చోరీకి గురికావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగి ఘటనా స్థలిలోని సీసీ ఫుటేజీని పరిశీలించగా, ఓ ట్రాఫిక్ పోలీస్ ప్రైవేట్ రికవరీ వ్యాన్‌తో రాత్రి వేళల్లో కారును తీసుకెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. రికవరీ వ్యాన్ నంబర్ ఆధారంగా ఆరా తీయగా సదరు కారును బంజారాహిల్స్ ట్రాఫిక్ పీఎస్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న ఠాకూర్ నితేష్ సింగ్ చోరీ చేసినట్లుగా గుర్తించారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆసిఫ్‌నగర్‌లోని నితేష్ ఇంటి వద్ద దాచిన కారును స్వాధీనం చేసు కున్నారు. సోమవారం నిందితుడిని అరెస్టు చేశారు.

ఆర్థిక, సామాజిక సవాళ్లను ఎదుర్కొనేందుకే 'మిత్ర'

టీఎస్ఎస్‌పీ అడిషనల్ జీపీ స్వాతి లక్రా

వెంగళరావునగర్: పోలీసు కుటుంబాల్లో ఆర్థిక, సామాజిక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కునేందుకు మిత్ర వ్యక్తిత్వ వికాస కార్యక్రమం దోహదపడుతుందని టీఎస్ఎస్‌పీ అడిషనల్ జీపీ స్వాతి లక్రా అన్నారు. యూసుఫ్‌గూడలోని టీఎస్ఎస్‌పీ ఫస్ట్ బెటాలియన్ ప్రాంగణంలో సోమవారం అమృత విశ్వ విద్యాపీఠం ఆధ్వర్యంలో మిత్ర (షేర్ అండ్ షైన్) రెండో బ్యాచ్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. 30 రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. మిత్ర శిక్షణ తీసుకున్న ప్రతి ఒక్కరూ పటాలంలో అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులను సంక్షేమ పథంలో నడిపించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీఎస్ఎస్‌పీ ఫస్ట్ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నరేందర్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్స్ సత్యనారాయణ, జవహర్‌లాల్, ఆర్ఐలు ధర్మారావు, సాంబయ్య, శంకర్, రవీందర్, రాజేశం, ఆర్ఎస్ఐలు, ఫస్ట్ బెటాలియన్ సిబ్బంది, అమృత విద్యాపీఠం నిపుణులు డాక్టర్ భవానీ, ఫ్యాకల్టీ రాధికాశెట్టి, రాధికా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ పేరిట నకిలీ ఫేస్‌బుక్ ఖాతా

సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ పేరిట సోషల్ మీడియాలో ఫేస్‌బుక్ అకౌంట్ క్రియేట్ కావడంతో ఏసీబీ అధికారులు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. సీవీ ఆనంద్ పేరుతో ఫేస్ బుక్ , ఇన్‌స్టాగ్రామ్‌లలో గుర్తుతెలియని వ్యక్తులు ఫేక్ అకౌంట్‌లు ఓపెన్ చేసినట్లు ఫిర్యాదు లో పేర్కొన్నారు. ఆయా ఖాతాల నుంచి ఫ్రెండ్ రిక్వెస్టులు పంపించారు. ఈ విషయం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే సీవీ ఆనంద్ దృష్టికి వచ్చింది. ఈ ఆయన సూచన మేరకు ఏసీబీ అధికారులు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సైబర్ క్రైమ్ ఏసీపీ శివ మారుతి తెలిపారు.

ప్రతి ఎకరాకు నీరందిస్తాం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- అన్మాస్‌పల్లిలో గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభం



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగు నీరు అందించి, నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అన్మాస్‌పల్లిలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గ్రామ సచివాలయాన్ని సర్పంచ్ శంకర్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగు నీరు అందించడమే లక్ష్యం అన్నారు. గ్రామాలు, తండాలలో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానన్నారు. సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు నిర్మిస్తానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. విద్యా, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు తప్పకుండా అమలు చేస్తామన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ అభ్యర్థన మేరకు అన్మాస్‌పల్లిలో గ్రామపంచాయతీ కార్యాలయం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, రాములుగౌడ్, ఉప సర్పంచ్ అనిల్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నర్సింహ, బీక్యానాయక్, భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, బీచ్యానాయక్, యాదగిరిరెడ్డి, జగన్‌గౌడ్, సుధీర్‌రెడ్డి, బిక్కు, శేఖర్‌గౌడ్, వెంకటేశ్, చందోజీ, జహంగీర్‌అలీ, రామకృష్ణ, రాజుగౌడ్, కేశవులు, కృష్ణ, శ్రీరాములుగౌడ్, కుమార్ కార్యదర్శి హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

నందిగామ: పార్టీలకతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. మండలంలోని అప్పారెడ్డిగూడలో నిర్మించిన సరోజినిదేవి మహిళా సమాఖ్య భవనాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ నర్సింహ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భవన నిర్మాణానికి గ్రామానికి చెందిన మేడిపల్లి రవీందర్‌రెడ్డి తన తల్లి సరోజినిదేవి జ్ఞాపకార్థకంగా స్థలాన్ని దానం చేయడం గొప్ప విషయమన్నారు. మహిళ సమాఖ్య భవన నిర్మాణానికి జెడ్పీజీఎఫ్ నిధులు రూ.10 లక్షలతో భవనాన్ని నిర్మించారన్నారు. గ్రామాభివృద్ధికి కావల్సిన పనులను తెల్లకాగితంపై రాసి ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ప్రతి పనిని పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి పార్టీలకతీతంగా కృషి చేయాలని సూచించారు. తన గెలుపునకు కృషి చేసిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రియాంక, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షురాలు కాట్నలత, భూదాతలు రవీందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ఉప సర్పంచ్ సీతారాం, నాయకులు కృష్ణ, కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, నర్సింహ, హరినాథ్‌రెడ్డి, సర్పంచులు పాండురంగారెడ్డి, ప్రభాకర్, నర్సింహ, నవాజ్ రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, బాల్‌రెడ్డి, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన సెల్ఫీ సరదా

రైలు ఢీకొని యువకుడి మృతి

కాచిగూడ: సెల్ఫీ తీసుకోవడానికి రైలు పట్టాలపైకి వెళ్లిన ఓ యువకుడు రైలు ఢీకొని మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బహదూర్‌పుర కు చెందిన అబ్దుల్ రహమాన్ (23) అబిడ్స్‌లోని ఓ ఆప్టికల్ షాపులో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం అతను తన స్నేహితులతో కలిసి యాకుత్‌పుర - ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య సెల్ఫీ తీసుకునేందుకు రైలు పట్టాలపైకి వెళ్లాడు. అదే సమయంలో వేగంంగా వచ్చిన ఎంఎంటీఎస్ రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి స్నేహితులు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గూడూరు శివాలయంలో చోరీ

హుండీ పగులగొట్టి నగదు దోచుకెళ్లిన దుండగులు



దుండగులు ధ్వంసం చేసిన హుండీలు

కొత్తూరు: మండలంలోని గూడూరు గ్రామంలో ఉన్న శివాలయంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. గ్రామస్తులు సోమవారం ఉదయం శివాలయంలో పూజలు చేయడానికి వెళ్లారు. అప్పటికే ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీలు ధ్వంసమై ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందిచారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు హుండీలను పగులగొట్టిన విధానాన్ని పరిశీలించారు. గతేడాది నుంచి భక్తులు సమర్పించిన కానుకలు(నగదు) సుమారు రూ.లక్ష వరకు హుండీల్లో ఉన్నట్లు స్థానికులు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హుక్కా సెంటర్‌పై దాడి

ఏడుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



హుక్కా పరికరాలతో పట్టుబడ్డ యువకులు

పహాడీషరీఫ్: బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా కొనసాగుతున్న హుక్కా సెంటర్‌పై మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు నిర్వాహకులు పరారీలో ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి మున్సిపాలిటీలోని ఎర్రకుంటలో మహ్మద్ అబ్దుల్ హసన్, హబీబ్ అహ్మద్ సాగర్‌లు చిల్లు పేరుతో హుక్కా సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు సోమవారం దాడులు చేసి.. షాహిన్‌నగర్‌కు చెందిన అనాస్(25), గౌస్ సమీ(19), మహ్మద్ అజీం ఖాన్(18), సయ్యద్ జమా(25), మహబూబ్(19), ఫక్రుల్లా ఖాన్(19), అక్బర్(19)లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,260ల నగదు, ఫోన్లు, హుక్కా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు



వినతిపత్రం అందిస్తున్న నర్సింలు

షాద్‌నగర్ రూరల్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు కోరారు. సోమవారం ఉపాధ్యాయుల జీపీఎఫ్ ఖాతాలను సరిచేయాలని కోరుతూ మహబూబ్‌నగర్ జెడ్పీ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 317 జీఓ ప్రకారం ఉపాధ్యాయులను నూతన జిల్లాలకు కేటాయించారన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి రంగారెడ్డి జిల్లాకు బదిలీ పైన వెళ్లిన ఉపాధ్యాయుల జెడ్పీ జీపీఎఫ్ ఖాతాల్లో అనేక పొరపాట్లు చోటుచేసుకున్నాయని, వాటిని సరిచేయాలన్నారు. దాదాపు 1,160 మంది ఉపాధ్యాయుల ఖాతాల్లో జమలు, ఉపసంహరణలు సక్రమంగా లేవన్నారు. ఎక్కువ ఖాతాల్లో డబ్బులు లేనట్టుగా చూయిస్తున్నారన్నారు. ఉపాధ్యాయుల ఖాతాలు బదిలీ కాకుండా ఉంటే వెంటనే వాటిని బదిలీ చేయాలని కోరారు.

మెస్ బిల్లులు విడుదల చేయాలి

సాక్షి, సిటీబ్యూరో : పెండింగ్ మెస్ చార్జీలు, ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి నేతలు అన్నారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కే అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. ఏడాదిగా వసతి గృహాలు, గురుకులాలు,కేజీబీవీలు ,ఆశ్రమ పాఠశాల మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బిల్లులు విడుదల చేయాలని గత ప్రభుత్వ హయాంలో పలు మార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. గత ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలు క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదన్నారు. ఆరేళ్లుగా స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా, రాష్ట్ర కమిటీ సభ్యురాలు రమ్య, జిల్లా ఉపాధ్యక్షులు నాగేందర్, శ్రీమన్, స్టాలిన్, భావన, శివ ,గణేష్ ,రమేష్, భరత్ పాల్గొన్నారు.

ఈఎల్‌టీఏ ఆధ్వర్యంలో పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మొయినాబాద్: విద్యార్థుల్లో ఇంగ్లిష్‌పై ఉన్న భయం పోవాలని పెద్దమంగళారం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రఘునాథ్ అన్నారు. మండల పరిధిలోని పెద్దమంగళారం పాఠశాలలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఈఎల్‌టీఏ) ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇంగ్లిష్ భాషపై మండల స్థాయి స్పెల్ వీజర్డ్, డ్రామా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీల్లో పెద్దమంగళారం, కనకమామిడి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలువగా చందానగర్ జెడ్పీహెచ్ఎస్, కేజీబీవీ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజుల, అనిత, నారాయణ, మైమూద్, రాములు, కమల తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలపై వివక్ష తగదు

బంజారాహిల్స్: దేశంలో విశ్వవిద్యాలయాలకు కేటాయించే బడ్జెట్ క్రమంగా తగ్గుతోందని, తద్వారా పేద పిల్లలకు ఫీజులు భారంగా పరిణమించాయని ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. ప్రభుత్వాలు విశ్వవిద్యాలయాలను ఆర్థికంగా ఆదుకోకపోగా జీత భత్యాలకు అవసరమైన సొమ్మును కూడా విద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నాయన్నారు. సోమవారం డా.బి.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, సామాజిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'భారతదేశంలో ఉన్నత విద్య: నాణ్యమైన విద్య, సమస్యలు, సవాళ్లు' అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన కీలకోపన్యాసం చేశారు. ప్రస్తుత సమాజంలో మతం శక్తి వనరుగా మారి తాజాగా విద్యారంగంలోకి కూడా పాకిందన్నారు. డా.బి.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం సామాజిక న్యాయానికి పెద్ద పీట వేస్తుందన్నారు. నేర్చుకునే క్రమంలోనే ప్రశ్నించే తత్వం అలవడాలని తద్వారా జ్ఞానం వస్తుందన్నారు. వర్సిటీ వీసీ ఆచార్య.కె.సీతారామారావు మాట్లాడుతూ దేశంలో అన్ని ఉన్నత విద్యా సంస్థలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, ఆయా సంస్థలను పర్యవేక్షించే రెగ్యులేటరీ బాడీలు తీసుకునే అనాలోచిత నిర్ణయాలు, అప్పటికప్పుడు మార్చుకునే నిర్ణయాలతో విద్యా సంస్థలకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గౌరవ అతిథిగా పాల్గొన్న విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ ప్రొ.ఘంటా చక్రపాణి మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో జరిగే పరిశోధనలు సమాజాభివృద్ధికి దోహదం చేస్తాయని, పరిశోధనల్లో నాణ్యత పెరగాలని సూచించారు. ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న చక్రపాణిని ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్య హన్మంత రావు, ఆచార్య ఆర్.వి. రమణమూర్తి, ఆచార్య వై.పార్థసారథి, ఆచార్య జి నాగరాజు, ఆచార్య చెన్న బసవయ్య పాల్గొన్నారు.

పిల్లలకు మంచి వాతావరణాన్ని కల్పించాలి

నగర పోలీస్, భరోసా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు టీఓటీ వర్క్‌షాప్



టీఓటీ రూపొందించిన ఫోల్డర్‌ను ఆవిష్కరిస్తున్న నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి

గన్‌ఫౌండ్రి: చిన్నారులకు సురక్షితమైన వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులపై ఉందని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఆయన హైదరాబాద్ నగర పోలీస్ శాఖ, భరోసా కేంద్రాల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు సీఎస్ఏపై మూడురోజుల పాటు నిర్వహించనున్న టీఓటీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... ఉపాధ్యాయులు పిల్లలను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాలని, లైంగిక దాడులు, వేధింపులను ఎదుర్కోవడం వంటి కేసులను నివేదించడంలో క్రియాశీలక పాత్రపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు 100 మంది ఉపాధ్యాయులు పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తామన్నారు. సురక్షితమైన, అసురక్షితమైన స్పర్శపై చిన్నారులకు అవగాహన కల్పించడంపై ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతామన్నారు. ఉపాధ్యాయులకు ప్రముఖ సైకాలజీ కౌన్సిలర్లు తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం భరోసాను ఎలా చేరుకోవాలి, పాఠశాలలో బాలలపై లైంగిక వేధింపులను గుర్తిస్తే సిఫార్స్ చేయబడిన చర్యలపై రూపొందించిన ఫోల్డర్లను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులతో రోజు కమ్యూనికేట్ చేయడం, సంబంధిత విషయాలను పంచుకునేందుకు వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. సమావేశంలో నగర జాయింట్ సీపీ ఏవీ రంగనాథ్, మహిళా భద్రత విభాగం అధికారి డి.కవిత పాల్గొన్నారు.